సాక్షి
యాదాద్రి భువనగిరి
శనివారం । 9 । ఆగస్టు । 2025



ఉద్యమంలా వన మహోత్సవం..
ఉద్యమం మాదిరిగా వన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. - 8లో



గంజాయి నిందితుల అరెస్ట్
గంజాయి తరలిస్తున్న ఏడుగురు యువకులను మిర్యాలగూడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



ప్రజాస్వామ్యం ఖూనీ..
నరేంద్రమోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి విమర్శించారు. - 10లో

న్యూస్‌రీల్

వర్షాలతో అన్ని రకాల పంటలకు మేలు

భువనగిరి : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వరి, పత్తి, కందితో పాటు మిగతా అన్ని రకాల పంటలకు మేలు చేకూరుతుందని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు నెలలో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగా నమోదైందన్నారు. వివిధ దశల్లో ఉన్న పంటలకు ఈ వర్షాలు ఎంతో దోహదపడుతాయన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత ఎరువులు పెట్టాలని రైతులకు సూచించారు. భూగర్భ జలాలు వృద్ధి చెంది వరి సాగుకు అనుకూలత ఏర్పడనుందన్నారు.

డబ్బులు రికవరీ, కేసు నమోదు

మోత్కూరు : తప్పుడు పత్రాలతో కల్యాణలక్ష్మి పథకం ద్వారా లబ్ధిపొందిన వ్యక్తుల నుంచి డబ్బులు రికవరీ చేయడంతో పాటు నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మోత్కూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన వల్లపు సోమలక్ష్మి–స్వామి దంపతుల కుమార్తె రాధికను 2011లో వలిగొండ మండలం మొగిలిపాకకు చెందిన మర్ల మహేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఆ తరువాత వివాహం జరిగినట్లు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి రూ.1,00,116 లబ్ధి పొందారు. విచారణలో వాస్తవమని తేలడంతో తహసీల్దార్ జ్యోతి ఫిర్యాదు మేరకు నలుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వారి నుంచి నగదు రికవరీ చేసినట్లు తహసీల్దార్ వెల్లడించారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవోత్సవం



సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం నిత్యారాధనలో భాగంగా ఆండాళ్‌దేవికి ఊంజల్ సేవోత్సవం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అధిష్టింపజేసి ఊంజల్ సేవ నిర్వహించారు. ఇక ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ, గర్భాలయంలో స్వయంభూలకు అభిషేకం, సహస్రనామార్చనలు, ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణ వేడుక తదితర పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

నూతన డ్రెయినేజీలు నిర్మిస్తాం



ప్రశాంత్‌నగర్‌లో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుద్ధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

యాదగిరిగుట్ట: పట్టణంలో డ్రెయినేజీ సమస్యపై 'మురుగుతో అవస్థలు' శీర్షికతో ఈనెల 7న సాక్షిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. కమిషనర్ లింగస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దండు కిరణ్‌బాబు శుక్రవారం అధ్వానంగా మారిన డ్రెయినేజీలు, కూలిపోయిన డ్రెయినేజీలను పరిశీలించారు. చెత్తాచెదారం తొలగించడంతో పాటు బ్లీచింగ్ చల్లించారు. దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వదిలారు. కూలిపోయిన డ్రెయినేజీలతో స్థానంలో, అవసరమైన చోట టీయూఎఫ్ఐడీసీ నిధులతో నూతన డ్రెయినేజీలు నిర్మిస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

నల్లగొండ టూటౌన్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పరీక్షలను అధికారులు తనిఖీ చేశారు. యూనివర్సిటీలో పరీక్ష కేంద్రాలను వైస్ చాన్సలర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి, సీఓఈ జి.ఉపేందర్‌రెడ్డి పర్యవేక్షించారు.

వరాల తల్లీ.. వందనం



శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. లక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించి సహస్రనామార్చన, కుంకుమార్చన, మంగళహారతి, మంత్ర పుష్పములు తదితర పూజలు చేశారు.





భూదాన్‌పోచంపల్లి : శ్రీమార్కండేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వ్రత పూజలో పాల్గొన్న మహిళలు

భువనగిరి బస్టాండ్‌ను ఆధునీకరించాలి

- మంత్రి పొన్నంకు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి వినతి

సాక్షి, యాదాద్రి: భువనగిరి బస్టాండ్‌ను ఆధునీకరించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం సచివాలయంలో మంత్రిని కలిశారు. భువనగిరి బస్టాండ్ నుంచి నిత్యం వేలాది మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారని, సరైన వసతులు, సరిపడా బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అదే విధంగా డీలక్స్, లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో చాలా వరకు బస్టాండ్‌కు రాకుండా నేరుగా బైపాస్ నుంచి వెళ్తున్నాయని పేర్కొన్నారు. దీనివల్ల జనగామ, హైదరాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం రాత్రి పొద్దుపోయే వరకు బస్టాండ్‌లో నిరీక్షించాల్సి వస్తుందన్నారు. అన్ని రకాల సర్వీస్‌లు బస్టాండ్‌కు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రికి విన్నవించారు. భువనగిరి నియోజకవర్గంలో ఎనిమిది గ్రామాలకు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు.

బీఎన్ తిమ్మాపురం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని వినతి

బస్వాపురం రిజర్వాయర్ ముంపు గ్రామం బీఎన్ తిమ్మాపురం నిర్వాసితులకు రూ.80 కోట్లు పరిహారం పెండింగ్ ఉందని, త్వరగా చెల్లించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి విన్నవించారు. అదే విధంగా నియోజకవర్గంలో లో ఓల్టేజీ సమస్య పరిష్కరించడానికి వలిగొండకు 132/11 కేవీ సబ్‌స్టేషన్, తొమ్మిది 11 కేవీ సబ్‌స్టేషన్లను మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సబ్‌స్టేషన్ల శంకుస్థాపనకు రావాలని డిప్యూటీ సీఎంను ఆహ్వానించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. వీరితో పాటు మరికొందరు మంత్రులను కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వాలని విన్నవించారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

సెల్ఫీ.. విత్ రాఖీ



అన్నాచెల్లెల్ల అనురాగానికి ప్రతీక రాఖీ పండుగ. శనివారం రాఖీ పండుగ జరుపుకునేందుకు మీరు సిద్ధమయ్యారా.. మీ ఫొటోలను 'సాక్షి'లో చూసుకోవాలనుకుంటున్నారా.. మరి ఎందుకు ఆలస్యం.. మీ సోదరీమణులతో రాఖీలు కట్టించుకుంటూ సెల్ఫీ తీసుకున్న ఫొటోలను 'సాక్షి'కి పంపిస్తే ఆదివారం సంచికలో ప్రచురిస్తాం.

'రాఖీ' సెల్ఫీ ఫొటోలు పంపాల్సిన వాట్సప్ నం.
80962 93702

ఒక్క జత యూనిఫాంతోనే బడికి

- రెండో జత పంపిణీలో జాప్యం
- మూడు నెలలుగా విద్యార్థుల ఎదురుచూపులు
- పంద్రాగస్టుకు పాత యూనిఫాంతోనే పాఠశాలకు..



భువనగిరి: విద్యార్థులకు ఒక జత యూనిఫాం అందజేసిన సర్కారు.. రెండోది పంపిణీ చేయడంలో జాప్యం చేస్తోంది. విద్యా సంవత్సరం పునఃప్రారంభం రోజునే రెండు జతల యూనిఫాం, పుస్తకాలు అందజేయాల్సి ఉంది. కానీ, విద్యార్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఒక రోజు యూనిఫాం వేసుకొస్తే మరుసటి రోజు సివిల్ డ్రెస్‌తో పాఠశాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

వస్త్రం ఆలస్యంతోనే..

ప్రభుత్వం ఏటా రెండు జతల యూనిఫాం విద్యార్థులకు పంపిణీ చేస్తుంది. మే నెలలోనే రెండు జతల యూనిఫాంకు వస్త్రం సరఫరా చేయాలి. కానీ, పూర్తిస్థాయిలో వస్త్రం రాకపోవడంతో పాఠశాలల పునఃప్రారంభం రోజున ఒకే జత అందజేశారు. రెండో జతకు సైతం వస్త్రం అలస్యంగా రాగా.. అది కూడా సగమే సరఫరా చేశారు. ఈ నెలాఖరు నాటికి రెండో జత యూనిఫాం అందజేస్తామని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం మహిళా సంఘాల ద్వారా యూనిఫాం కుట్టే ప్రక్రియ కొనసాగుతోంది.

43,188 మంది విద్యార్థులు

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 715 ఉన్నాయి. వీటిలో 43,188 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా 55 రోజులుగా ఒకే జత యూనిఫాంతో పాఠశాలకు హాజరవుతున్నారు. పంద్రాగస్టుకు పాత యూనిఫాంతో హాజరుకావాల్సి వస్తుంది.

ఈ నెలాఖరులో పంపిణీ చేస్తాం

మొదటి జత యూనిఫాం పాఠశాలల పునఃప్రారంభం రోజునే ఇచ్చాం. రెండో జత కూడా ఈ నెలాఖరులో పంపిణీ చేస్తాం. వస్త్రం సగం వచ్చి మిగతా సగం అలస్యంగా రావడంతో రెండో జత పంపిణీలో జాప్యం జరుగుతుంది. ప్రస్తుతం స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో యూనిఫాం కుట్టే ప్రక్రియ కొనసాగుతోంది. పూర్తి కాగానే వెంటనే విద్యార్థులకు పంపిణీ చేస్తాం.

–సత్యనారాయణ, డీఈఓ

42 శాతం రిజర్వేషన్లపై సీపీఎం దీక్ష.. భగ్నం



భువనగిరిలోని ప్రిన్స్ చౌరస్తాలో దీక్ష చేయటానికి ఏర్పాటు చేసిన టెంట్‌ను తొలగిస్తున్న పోలీసులు



సీపీఎం నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

భువనగిరిటౌన్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్‌తో శుక్రవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భువనగిరిలోని ప్రిన్స్ చౌరస్తాలో చేపట్టిన పార్టీ నాయకులు చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేశారు. టెంట్‌ను తొలగించడంతో పాటు నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్ తరలించారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచికత్తుపై వదిలిపెట్టారు. అక్కడి నుంచి వచ్చి సీపీఎం కార్యాలయంలో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జహంగీర్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ బిల్లు చట్టబద్ధత పొందాలంటే రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. ఈ అంశాన్ని పార్లమెంట్‌లో చర్చించి చట్టరూపంలోకి తీసుకురావాల్సిన బాధ్యత బీజేపీదేనని, తెలంగాణలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఏకపక్షంగా వెళ్లకుండా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కోరారు. పోలీసుల తీరును వారు ఖండించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, కొండమడుగు నరసింహ, నాయకులు మాటూరు బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, బూరుగు కష్టారెడ్డి, జెల్లెల పెంటయ్య, సిర్పంగి స్వామి, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మాయ కృష్ణ, బోలగాని జయరాములు, బొల్లు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

- 11న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- 1,43,789 మంది గుర్తింపు

భువనగిరి: ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి వైద్యారోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 11వ తేదీన 1 నుంచి 19 ఏళ్ల వయస్సులోపు వారికి మాత్రలు పంపిణీ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,43,789 మందిని గుర్తించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలు, గురుకులాలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు మాత్రలు వేస్తారు. 1.75 లక్ష ఆల్బెండజోల్ మాత్రలు అందుబాటులో ఉంచారు. మొదటిరోజు మిగిలిపోయిన వారికి 18న పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం ఎంపీహెచ్‌ఏలు 246, ఆశ వర్కర్లు 690, అంగన్‌వాడీ టీచర్లు 843, ర్యాపిడ్ టీంలు 24 ఏర్పాటు చేశారు. 1,2 ఏళ్ల వయస్సున్న పిల్లలకు సగం టాబ్లెట్ వేయనున్నారు. వైద్యారోగ్య శాఖ గుర్తించిన ప్రతి ఒక్కరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని డీఎంహెచ్‌ఓ మనోహర్ తెలిపారు.

వ్యాధి వ్యాప్తి ఇలా..

బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన, అపరిశుభ్ర వాతావరణం, మట్టిలో ఆటలు, చేతులు శుభ్రం చేసుకోకుండా భోజనం చేయడం వల్ల నులిపురుగుల బారిన పడే అవకాశం ఉంది. ఈ వ్యాధి బారిన పడిన పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, కడుపు నొప్పి, బరువు తగ్గడం, ఏకాగ్రత లోపించడం వంటి సమస్యలు ఏర్పడుతాయి. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, ఆగస్టులో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తారు.



నులి పురుగుల నివారణ అవగాహన పోస్టర్

రెండు గంటలు ఏకధాటిగా..

గురువారం రాత్రి ముంచెత్తిన వాన

- జిల్లాలో సగటున 11.21 సెంటీ మీటర్ల వర్షం
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- మూసీకి పోటెత్తిన వరద, లో లెవల్ వంతెనల పైనుంచి ప్రవాహం
- రాకపోకలు నిలిపివేసిన అధికారులు
- చెరువుల్లోకి చేరుతున్న నీరు



అడ్డగూడూరు మండలం మానాయికుంట - గురజాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ

సాక్షి,యాదాద్రి: జిల్లాలోని పలు మండలాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. 8 గంటల నుంచి 10 గంటల వరకు ఏకధాటిగా కురిసిన వానకు లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా నీరు చేరింది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మూసీకి వరద పోటెత్తింది. చెరువుల్లోకి నీరు చేరుతోంది. అత్యధికంగా ఆత్మకూర్ (ఎం) 159.5 మి.మీ, అడ్డగూడూరు 132.5 మి.మీ, వలిగొండ 108.7 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా సగటున 11.21 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. జూన్, జూలై మాసాల్లో సరైన వర్షాలు లేక భూగర్భజలాలు పడిపోయాయి. దీంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. అన్ని పంటలు కలిపి 52 శాతానికి మించి సాగు కాలేదు. ప్రస్తుతం కురిసిన భారీ వర్షం పంటలకు జీవం పోసింది.

ప్రమాదకరస్థాయిలో మూసీ

జిల్లాతో పాటు హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి, హిమాయత్‌సాగర్ నుంచి నీటిని విడుదల చేయడంతో మూసీ పరవళ్లు తొక్కుతోంది. బీబీనగర్ –భూదాన్‌పోచంపల్లి మధ్య రుద్రవెల్లి వద్ద, వలిగొండ మండలం బొల్లేపలి – సంగెం మధ్యన లోలెవల్ వంతెనల పైనుంచి ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తోంది. ఆయా ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేశారు. ఎగువ నుంచి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పెద్ద ఎత్తున కొట్టుకువచ్చి లోలెవల్ బ్రిడ్జిల వద్ద తూములకు అడ్డంకిగా మారాయి. అదే విధంగా మోటకొండూరు మండలం కొండాపురం–కాల్వపల్లి వద్ద బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. రైతులు, గీతకార్మికులు ప్రమాదకరంగా వాగును దాటుతున్నారు. మోత్కూరు పరిధిలో బిక్కేరువాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. చౌటుప్పల్ మండలం నేలపట్ల–వర్కట్‌పల్లి మధ్య ఈదుల వాగుకు వరద ఉధృతి పెరగడంతో వాగుదాటుతున్న క్రమంలో కారు కొట్టుకుపోయింది. కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు వ్యక్తులు అప్రమత్తమై సురక్షితంగా బయటపడ్డారు. స్థానికులు తాళ్ల సహాయంతో కారును బయటకు తీశారు.

సాధారణం కంటే అధిక వర్షం

ఈ సీజన్‌లోనే అధిక వర్షం కురిసింది. ఆగస్టు నెలలో సాధారణ వర్షపాతం 268 మి.మీ కాగా.. 353.7 మి.మీ వర్షపాతం నమోదైంది. రెండు రోజుల్లోనే సాధారణం కంటే 32 మి.మీ అధిక వర్షం కురిసింది. జిల్లాలో 17 మండలాలకు గాను 2 మండలాల్లో అత్యధికంగా, 7 మండలాల్లో అధికంగా, 8 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.



సంగెం వద్ద కాపలా కాస్తున్న పోలీస్



అలుగుపోస్తున్న పోచంపల్లి చెరువు

వర్షపాతం (మి.మీ)

మండలం	వర్షం	మండలం	వర్షం
ఆత్మకూర్ (ఎం)	159.5	నారాయణపురం	55.3
అడ్డగూడూరు	132.5	భువనగిరి	51.2
వలిగొండ	108.7	ఆలేరు	47.1
గుండాల	86.0	రాజాపేట	40.9
చౌటుప్పల్	77.6	పోచంపల్లి	39.5
రామన్నపేట	69.9	బి.రామారం	39.3
మోత్కూరు	67.1	బీబీనగర్	32.8
మోటకొండూరు	60.3	తుర్కపల్లి	29.5
		యాదగిరిగుట్ట	23.8

అన్నదాతకు ఊరట

భూగర్భ జలాలు అడుగంటిపోతున్న తరుణంలో కురుస్తున్న భారీ వర్షాలు అన్నదాతకు ఊరటనిస్తున్నాయి. ప్రధానంగా వాగుల వెంట బోర్లు, బావుల్లో నీటి మట్టం పెరుగుతోంది. దీంతో రైతులు దుక్కులు దున్నడం, నాట్లు వేస్తున్నారు. అదే విధంగా వర్షాలు పత్తి, ఇతర మెట్ట పంటలకు ప్రాణం పోశాయి. 1.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని అధికారులు అంచనా వేయగా.. వర్షాభావ పరిస్థితుల కారణంగా 80 వేల ఎకరాలకే పరిమితమైంది. వర్షాలు లేక చేలు ఎదగడం లేదు. నష్టాలు తప్పవని భావిస్తున్న రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు - రుద్రవెల్లి వద్ద మూసీలో కొట్టుకువచ్చిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు



ఆత్మకూర్(ఎం) సమీపంలో బ్రిడ్జి పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న బిక్కేరు వాగు

అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ హనుమంతరావు



జూలూరు- రుద్రవెల్లి వద్ద మూసీలో వరదను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భూదాన్‌పోచంపల్లి: జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా మూసీ పరివాహక మండలాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు.శుక్రవారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని జూలూరు – రుద్రవెల్లి గ్రామాల మధ్య మూసీని పరిశీలించారు.లోలెవల్ బ్రిడ్జిపై పేరుకుపోయిన ప్లాస్టిక్, చెత్తను తొలగించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఈ సీజన్‌లోనే గురువారం భారీ వర్షం కురిసిందని, ఆత్మకూర్(ఎం)లో 152 మి.మీ రికార్డు స్థాయి వర్షపాతం నమోదైందన్నారు. గడిచిన రెండు రోజుల్లో కురిసిన వర్షాలతో లోటు నుంచి 32 శాతం అధికంలోకి వచ్చామన్నారు. భారీ వర్షాలు కురుస్తున్నందున మూసీ పరిహకంలోని పోచంపల్లి, బీబీనగర్, వలిగొండ మండలాల అధికారులను అలర్ట్ చేశామని, లోలెవల్ బ్రిడ్జిలపై నుంచి వరద ప్రవహిస్తుండటంతో రాకపోకలు సాగించకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటున్నారని చెప్పారు.

సీజనల్ వ్యాధులపట్ల జాగ్రత్త

సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు కాచి వడగట్టిన నీటిని తాగాలని కలెక్టర్ సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా నీరునిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన భవనాల్లో విద్యార్థులను కూర్చొబెట్టవద్దని, అవసరమైతే స్కూల్‌కు ఒక రోజు సెలవు ఇవ్వాలని ఆదేశించారు. మట్టి గోడలున్న ఇళ్లలో నివసించవద్దని, వర్షాలు తగ్గేవరకు పంచాయతీ కార్యాలయాలు, కమ్యూనిటీ భవనాల్లో తాత్కాలికంగా ఆవాసం ఉండాలని సూచించారు. ఆయన వెంట డిటీ నాగేశ్వర్‌రావు, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే..

శ్రావణ శుక్రవారం సందర్భంగా సాక్షి నిర్వహించిన 'వరలక్ష్మి సెల్ఫీలకు ఆహ్వానం'కు విశేష స్పందన లభించింది. వరలక్ష్మి పూజలో కూర్చున్న మహిళలు సెల్ఫీ తీసుకుని పంపించారు. అందులో కొన్ని..


నీరటి ఉషస్విని, ఆలేరు


అప్పం స్వాతి, సిరిపురం, రామన్నపేట


బత్తిని ప్రవళిక, మోత్కూరు


బత్తిని సంధ్య, మోత్కూరు


సీహెచ్ కుమారి, భువనగిరి


చిన్నం రోజా, రాజాపేట


గుర్రం కవిత, మోత్కూరు


వనం శ్రీలత, వెల్లంకి, రామన్నపేట


కొలుపుల సౌజన్య, భువనగిరి


కొల్లోజు శ్వేత, మోత్కూరు


కొండ మాలతి, నిదానపల్లి, రామన్నపేట


లావణ్య, భువనగిరి, అర్బన్ కాలనీ


కార్తిక్ శర్మ దంపతులు మోటకొండూరు


పంతం రాధిక, ఆలేరు


రెబ్బా లక్ష్మి, చిత్తాపురం, వలిగొండ


శ్రీలత, చౌటుప్పల్


కాలేరు స్వప్న, భువనగిరి

క్లుప్తంగా

కాల్వలో పడి వ్యక్తి గల్లంతు

మాడుగులపల్లి: మండలంలోని పెద్దదేవులపల్లి కాల్వలో గురువారం సాయంత్రం వ్యక్తి గల్లంతయ్యాడు. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన ప్రభాకరన్ పెద్దదేవులపల్లి రెడ్డీస్ ల్యాబ్‌లో సేఫ్టీ విభాగంలో ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం సెలవు కావడంతో తన ముగ్గురు స్నేహితులతో కలిసి పెద్దదేవులపల్లి కాల్వ వద్దకు వెళ్లాడు. ప్రభాకరన్ ఈత కొట్టి బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా కాలు జారి ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. స్నేహితులు గమనించి అతడిని రక్షించే ప్రయత్నం చేసినా ప్రవాహానికి కొట్టుకుపోయాడు. ప్రభాకరన్ స్నేహితుడు విఘ్నేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

మూసీ వాగులో చేపల వేటకు వెళ్లిన యువకుడు గల్లంతు

వేములపల్లి: మూసీ వాగులో చేపల వేటకు వెళ్లిన యువకుడు గల్లంతయ్యాడు. ఆమనగల్లుకు చెందిన మద్దెబోయిన వెంకన్నపార్వతమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా హైదరాబాద్‌లో ప్రైవేట్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం గ్రామంలో బోనాలు నిర్వహిస్తుండగా రామకృష్ణ(22) హైదరాబాద్ నుంచి గ్రామానికి వచ్చాడు. శుక్రవారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి మూసీ వాగు వద్ద చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి వాగులో పడిపోయాడు. గమనించిన స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు. వాగు వెంట గాలింపు చర్యలు చేపట్టారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

హుజూర్‌నగర్ : మండలంలోని లింగగిరిలో గురువారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన నాగలక్ష్మి ఇంట్లో రాత్రి సమయంలో విద్యుత్ హెచ్చుతగ్గుల వల్ల షార్ట్‌సర్క్యూట్ జరిగింది. దీంతో ఇంట్లో మంటలు వ్యాపించి టీవీ, పుస్తకాలు, బీరువాలో బట్టలు, నగదు కాలిపోయాయి. దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. శుక్రవారం ఆర్ఐ గాలి శ్రీనివాస్ ఇంటిని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

గంజాయి నిందితుల అరెస్టు

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఏడుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను శుక్రవారం మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖరరాజు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, ఉప్పలపహాడ్ గ్రామానికి చెందిన భూక్యా హనుమా నాయక్, సంగాల కాటంరాజు, నర్సారావుపేట జిల్లా కారంపుడికి చెందిన మద్దూరి చంటి గంజాయికి అలవాటు పడి ముఠాగా ఏర్పడ్డారు. బలిమెల, ఒడిశా రాష్ట్రానికి చెందిన ఆనంద్ గురు వద్ద గంజాయి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

వీరికి మిర్యాలగూడకు చెందిన కొందరు వ్యక్తులు పరిచయం కావడంతో వారి ద్వారా ఇక్కడకు తీసుకువచ్చి అమ్ముతున్నారు. ఈక్రమంలో గురువారం భూక్యా హనుమానాయక్, సంగాల కాటంరాజు, మద్దూరి చంటి రెండు గ్రూపులుగా విడిపోయి చంటి బైక్‌పై మిర్యాలగూడ పట్టణానికి వచ్చి ఐదున్నర కిలోల గంజాయిని విక్రయిస్తున్నారనే సమాచారం అందింది. మద్దూరి చంటి, మిర్యాలగూడకు చెందిన షేక్ రియాజ్, మహమ్మద్ హర్షత్ అయూబ్, మహ్మద్ సలీం అక్బర్, మహమ్మద్ జునైద్ అలీ, షేక్ అఫ్రోజ్, కుర్ర సందీప్ ఖానాపురం శరత్‌లను అరెస్టు చేశామని.. భూక్యా హనుమానాయక్, సంగాల కాటంరాజు, ఆనంద్‌గురు పరారీలో ఉన్నారని తెలిపారు. నిందితుల వద్ద 7.4 కిలోల గంజాయి, కారు, మూడు ద్విచక్ర వాహనాలు, పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో టూ టౌన్ సీఐ సోమనర్సయ్య, రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య, టూటౌన్ ఎస్ఐ రాంబాబు, హెడ్ కానిస్టేబల్ ఎస్.యాదగిరిరెడ్డి, కానిస్టేబుళ్లు ఎల్.సూర్య, పి.బాలకృష్ణ, ఎండీ అక్బర్ పాష, జి.లక్ష్మయ్య, రాజశేఖర్, సమాద్, వెంకన్న, మహేష్, సైదులు, నాగరాజు, రాములునాయక్, సైదానాయక్ తదితరులున్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా నిందితుల రిమాండ్

మిర్యాలగూడ అర్బన్: రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తుండగా పట్టుబడిన ఐదుగురు నిందితులను శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖరరాజు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గుంటూరు జిల్లా, అర్బన్ బాలాజీ నగర్‌కు చెందిన కొమ్మలపాటి శ్రీనివాస్, గుంటూరుకు చెందిన వెంక సుబ్బారావు, పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన మహేష్‌రెడ్డి, నరసారావుపేటకు చెందిన రమేష్, సుకిల శ్రీనివాస్, యాటకూరుకు చెందిన నాగసాయి, గుజరాత్‌కు చెందిన మన్సూక్ బాయి, మనుబాయి మక్వన మొత్తం ఎనిమిది మంది ముఠాగా ఏర్పడ్డారు. రేషన్‌కార్డు లబ్ధిదారుల వద్ద తక్కువ ధరకు రేషన్ బియ్యం కొని రాష్ట్రం దాటించి అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వారి వ్యాపారం సాఫీగా జరగడానికి వారు పిడుగురాళ్లకు చెందిన మహేష్‌రెడ్డికి నెలకు రూ.3లక్షలు ఇస్తే.. అతడు లోడింగ్, అన్‌లోడింగ్, చెక్‌పోస్టులు దాటించేవాడు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు రమేష్, వాసు, శ్రీనివాసు అనే వ్యక్తులు కొంత కమీషన్ తీసుకుని సహకరించేవారు. ఈ క్రమంలో ఈ నెల 5న లారీలో 300 క్వింటాళ్ల రేషన బియ్యం లోడు చేసుకుని వస్తున్న క్రమంలో వాడపల్లి ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో పట్టుబడ్డారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేశామని, మరో ముగ్గురు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, త్రిపురారం ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ భవన నిర్మాణ పనుల పరిశీలన


పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

బీబీనగర్: స్థానిక నూతన పీహెచ్‌సీ భవనంలో కొనసాగుతున్న పనులను కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం పరిశీలించారు. పనులను వేగంగా పూర్తి చేయాలని త్వరలో భవనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అంతకుముందు రహీంఖాన్‌గూడెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అలాగే మండలంలోని రుద్రవెల్లి గ్రామంలో మూసీ నది గుండా ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించారు. వంతెలనపై నుంచి వరద నీరు ప్రవహిస్తే రాకపోకలను స్తంభింపజేసేలా చర్యలు తీసుకోవాలని పలు వాగుల వద్ద నీటి ఉధృతి ఉంటే ప్రజలు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులను ఎర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయం సందర్శన

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ హనుమంతరావు సందర్శించారు. భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులపై సమీక్షా నిర్వహించారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయని, వాటిలో ఎన్నింటిని పరిష్కరించారని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డిని అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన వాటిని త్వరగా పరిష్కరించాలని అన్నారు. పోచంపల్లిలో భూభారతిలో చాలా వరకు ప్రభుత్వ, భూదాన్, వక్ఫ్, పెద్దచెరువులో మునిగిన భూములకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

కూలి పనికి వెళ్తుండగా గుండెపోటుతో మహిళ మృతి

నకిరేకల్: కూలి పనికి వెళ్లేందుకు అడ్డామీదకు వచ్చిన మహిళకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుప్పకూలి అక్కడే ప్రాణాలు విడిచింది. ఈ సంఘటన శుక్రవారం నకిరేకల్‌లో చోటుచేసుకుంది. కేతేపల్లి మండలం కొత్తపేటకు చెందిన చందుపట్ల తిరుపతమ్మ(45) రోజు వారీ కూలీ పనికోసం శుక్రవారం ఉదయం నకిరేకల్‌లోని ఇందిరాగాంధీ చౌరస్తా సెంటర్‌కు వచ్చింది. ఆమెకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలికి భర్త, కుమార్తె ఉన్నారు.


నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో కుప్పకూలిన చందుపట్ల తిరుపతమ్మ

వన మహోత్సవం ఉద్యమంలా నిర్వహిద్దాం

- ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్టూడెంట్ పర్యావరణ్ కాంపిటీషన్ (ఎస్ఎస్‌పీసీ) 2025 హరిత్ ద వే ఆఫ్ లైఫ్ పోస్టర్‌ను శుక్రవారం ఎంజీ యూనివర్సిటీలో వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, కేంద్ర విద్యా శాఖ, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ పర్యావరణ విద్యా విధానంలో భాగంగా సామాజిక ఉద్యమం మాదిరిగా వన మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నెల రోజుల పాటు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది విద్యార్థుల చేత మొక్కలు నాటించనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడేందుకు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ ఆకుల రవి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జి. ఉపేందర్‌రెడ్డి, అధ్యాపకులు హైమావతి, డాక్టర్ శ్రీనివాస్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ కాన్ఫరెన్స్ కరపత్రాల ఆవిష్కరణ

నల్లగొండ టూటౌన్: గణితశాస్త్రం దాని అనువర్తనాలపై వచ్చే నెల 3, 4 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ కాన్ఫరెన్స్ కరపత్రాలను శుక్రవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ సెమినార్లు, సదస్సులు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు పరిశోధనలపై అవగాహన పెరుగుతుందన్నారు. రిజిస్ట్రార్ అల్వాల రవి మాట్లాడుతూ జాతీయ సెమినార్‌కు కావాల్సిన ఏర్పాట్లలో యూనివర్సిటీ తరపున అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంజీయూ గణిత విభాగ అధిపతి, మద్దిలేటి పసుపుల, బోర్డాఫ్ స్టడీస్ చైర్ పర్సన్ డాక్టర్ జి. ఉపేందర్‌రెడ్డి, అధ్యాపకురాలు హైమావతి, శ్రీనివాస్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

లింగ నిర్ధారణ కేసులో ఆర్‌ఎంపీ అరెస్టు

- ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్, సెల్‌ఫోన్ స్వాధీనం

సూర్యాపేటటౌన్ : వైద్యం వికటించి గర్భిణి మృతి చెందిన కేసులో ఆమెకు లింగ నిర్ధారణ పరీక్ష చేసిన ఆర్ఎంపీని పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ప్రసన్నకుమార్ వెల్లడించారు. మే 24న మోతె మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన బయ్యా అనూష అనే గర్భిణి నకిరేకల్‌లోని ఆర్ఎంపీ వైద్యుడు బాత్క యాదగిరి వద్ద లింగనిర్ధారణ పరీక్ష చేయించుకుంది. ఆడపిల్ల అని తేలడంతో ఆమె భర్త నగేష్ మరో ఆర్ఎంపీ జానయ్య, వారి బంధువు సందీప్ కలిసి ఆమెను సూర్యాపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెకు అర్హత లేని వైద్యులతో అబార్షన్ చేయించారు. అధిక రక్తస్రావం కావడంతో ఆమెను ఖమ్మంలోని మరో ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలిస్తుండగా మృతి చెందింది. ఈవిషయమై డీఎంహెచ్ఓ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు ఆర్ఎంపీ బాత్క యాదగిరిని నకిరేకల్‌లోని తన నివాసంలో పట్టణ పోలీసులు అరెస్టు చేసి విచారించగా నేరం అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. మొత్తం 10 మందిపై కేసు కాగా కొంత మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మరికొంత మంది పరారీలో ఉన్నట్లు చెప్పారు. నిందితుడు యాదగిరి వద్ద ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

రాఖీ పండుగకు వస్తూ..

- రోడ్డుప్రమాదంలో యువకుడు దుర్మరణం
- మరొకరికి తీవ్రగాయాలు

రామగిరి(నల్లగొండ): రాఖీ పండుగకు సొంతింటికి వస్తూ రోడ్డు ప్రమాదంలో యువకుడు ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. నల్లగొండ పట్టణంలోని సాగర్‌రోడ్డు ముత్యాలమ్మ కాలనీకి చెందిన సోదరులు గంటకంపు నాగరాజు, మణికంఠ హైదరాబాద్‌లో కారు డ్రైవింగ్ చేస్తారు. నల్లగొండలో ఉంటున్న సోదరిచే రాఖీ కట్టించుకునేందుకు శుక్రవారం హైదరాబాద్ నుంచి నల్లగొండ బైక్‌పై బయలుదేరారు. నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు గిరకబాయిగూడెం శివారులో ఎదురుగా డీసీఎం వాహనం అజాగ్రత్తగా అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న నాగరాజు(26) ప్రమాద స్థలంలోని మృతిచెందాడు. సోదరుడు మణికంఠకు కుడికాలు, చేయికి గాయాలు అయ్యాయి. తల్లి గంటకంపు అరుణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ రూరల్ ఎస్సై సైదాబాబు చెప్పారు.





కూలిన రైస్ మిల్లు గోడ

- ధ్వంసమైన ట్రాక్టర్
- తృటిలో తప్పించుకున్న ఇద్దరు యువకులు

బొమ్మలరామారం : ట్రాక్టర్‌కు ఆఫ్ వీల్స్ బిగిస్తుండగా పక్కనే ఉన్న రైస్ మిల్లు గోడ కూలింది. దీంతో ఇద్దరు యువకులు అక్కడి నుంచి పక్కకు జరగగా.. ట్రాక్టర్ నుజ్జునుజ్జు అయింది. బొమ్మలరామారం మండలంలోని నాగినేనిపల్లి గ్రామానికి చెందిన ఎడిజర్ల బాలకృష్ణ ట్రాక్టర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి గంగరబోయిన కృష్ణ పొలాన్ని శుక్రవారం దున్నడానికి వెళ్లాడు. గంగరబోయిన కృష్ణ పొలం పక్కనే రైస్‌మిల్ ఉంది. ట్రాక్టర్ దుక్కి దున్నడానికి ట్రాక్టర్ డ్రైవర్ బాలకృష్ణ, కృష్ణ కొడుకు ఉపేందర్‌లు ఆఫ్ వీల్స్ బిగిస్తుండగా.. చేస్తుండగా రైస్ మిల్లు గోడ కూలింది. క్షణాల్లో తేరుకున్న ఇద్దరు యువకులు అక్కడి నుంచి పక్కకు జరగడంతో ప్రాణాపాయం తప్పింది. గోడ కూలడంతో ట్రాక్టర్ ధ్వంసమైంది. నెల రోజుల క్రితమే తెచ్చుకున్న కొత్త ట్రాక్టర్ గోడకూలి ధ్వంసం కావడంతో బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.


ధ్వంసమైన ట్రాక్టర్

లారీని ఢీకొట్టిన కారు..


- నలుగురికి స్వల్పగాయాలు

మునగాల: మండల కేంద్రం శివారులో శుక్రవారం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు అతివేగంతో ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమాదం సమయంలో కారులో ఉన్న ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో నలుగురు ప్రాణాలతో బయటపడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గురైన కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



లాభాల పూ'బంతి'

- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం
- మిరప, పత్తి పంటల్లో రక్షణ పంటగా బంతి పూల సాగు


పెద్దవూరలో సాగవుతున్న బంతి పూల తోట

పాడిపంట

పెద్దవూర: బంతి సాగును జూన్, జూలై, అక్టోబర్, నవంబర్ నెలల్లో సాగు చేసేవారు. కానీ గత కొన్నేళ్లుగా రైతులు ఏడాది పొడవునా సాగు చేస్తున్నారు. జూన్, జూలై నెలల్లో సాగు చేసిన బంతి సాగు సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లోనూ, అక్టోబర్, నవంబర్ నెలలో సాగు చేసిన బంతిపూలు డిసెంబర్, జనవరితో పాటు ఫిబ్రవరిలో వచ్చే పండుగలు, పెళ్లిళ్లు, జాతరలు, ఫంక్షన్‌లకు దిగుబడి వస్తుండటంతో మంచి గిరాకీ వస్తుంది. రైతులు నీటి వసతిని బట్టి బంతిని సాగు చేసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని హార్టికల్చర్ అధికారి మురళి తెలిపారు.

యాజమాన్యం రెండు రకాలు..

ఆఫ్రికన్ మేరీగోల్డ్ : ఈ జాతి ఎత్తుగా పెరిగి అతి పెద్ద సైజు పూలు పూస్తాయి. ఇందులో ఆఫ్రికన్ జెయింట్, ఆరెంజ్ డబుల్, ఆఫ్రికన్ ఎల్లోజెయింట్ డబుల్, క్రాక్ జాక్, గోల్డెన్ ఏజ్ రకాలు అనువైనవి.

ఫ్రెంచ్ మేరీగోల్డ్ : ఈ జాతి పూలకుండీల్లో పెంచుకునే పొట్టి రకాలు. దీనిలో రెడ్ బ్రోకెడ్, రెస్పిన్ రెడ్, బట్టర్ స్కాచ్, వాలెన్సియా రకాలు అనువైనవి.

నేలలు: నీరు త్వరగా ఇంకిపోయే తేలిక పాటి సారవంతమైన నేలలు, ఇసుక నేలలు, నీటి తేమ తక్కువగా ఉండే నేలలు బంతి సాగుకు అనుకూలం. బంతిని మిరప, పత్తి పంటల్లో రక్షక పంటగా కూడా సాళ్లలో సాగు చేసుకోవచ్చు.

వాతావరణం: మన వాతావరణ పరిస్థితులు బంతిసాగుకు అనుకూలం. జూలై మధ్య కాలం నుంచి ఫిబ్రవరి మొదటి వారం వరకు నాటితే మార్కెట్‌కు పూల సరఫరా సెప్టెంబర్ నుంచి ఏప్రిల్ వరకు చేయొచ్చు.

నారుమళ్లు: ఎకరానికి సరిపడ నారు పెంచడానికి 800-1000 గ్రాముల విత్తనం అవసరం. మళ్లు తయారు చేసుకునే సమయంలో ఒక చదరపు మీటరుకి 8-10 కిలోలు బాగా చిలికిన పశువుల ఎరువు వేయాలి. విత్తడానికి మొదలు ఫాలిడాల్ పొడి చల్లితే చీమలు, చెదలు వంటి ఇతర క్రిముల నుంచి రక్షణ పొందవచ్చు. ఎత్తు నారు మళ్లు చేసుకుని విత్తనాన్ని సాళ్లలో నాటుకుంటే మొక్కల మధ్యదూరం సమంగా ఉండి నారు మొక్కలు ఏపుగా పెరుగుతాయి. దీనివలన కలుపు మొక్కలు, చీడపీడల నివారణ కూడా వీలవుతుంది. విత్తిన 5-7 రోజుల్లో మొలకలు వస్తాయి.

నాటే విధానం: 15-20 రోజుల వయసు లేదా 3-4 ఆకులు వచ్చిన మొక్కలను 45×25 సెంటీమీటర్ల దూరంలో నాటితే మొక్కల సాంద్రత ఎక్కువగా ఉండి పూల దిగుబడి పెరుగుతుంది. నారుని సాయంకాలం నాటుకుంటే బాగా పాతుకుంటాయి. ఆఫ్రికన్ మొక్కల్ని 40×30 సెంటీమీటర్లు దూరంలోనూ, ఫ్రెంచ్ బంతి మొక్కల్ని 20×20 సెంటీమీటర్ల దూరంలో నాటితే పూల దిగుబడి బాగా ఉంటుంది. నాటిన తర్వాత పల్చగా నీరు పెట్టుకోవాలి.

ఎరువులు: ఆఖరి దుక్కిలో ఎకరానికి 20 టన్నుల చొప్పున బాగా చిలికిన పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. దీనితోపాటు 20-40 కిలోల నత్రజని, 80 కిలోల భాస్వరం, 35 కిలోల పొటాష్‌ను ఇచ్చే ఎరువులను వేయాలి. మొక్కలు నాటిన 60 రోజుల వరకు శాఖీయంగా పెరిగే దశలో ఉంటాయి. ఈ సమయంలో తగినంత తేమ ఉండేలా చూడాలి. నేల స్వభావాన్ని బట్టి 5-8 రోజుల వ్యవధిలో నీరు కట్టాలి.

కత్తిరింపులు: వాణిజ్యపరంగా పెంచే ఆఫ్రికన్ బంతి రకాలు ఎత్తుగా పెరిగి చాలా తక్కువగా పూలు వస్తాయి. కనుక మొక్కలు 30-40 సెంటీమీటర్ల ఎత్తులో లేదా నాటిన 30-35 రోజులకు తలభాగం కత్తిరిస్తే మొక్క కింది భాగం నుంచి పక్క కొమ్మలు ఎక్కువగా వచ్చి పూల దిగుబడి పెరుగుతుంది. అంతేకాకుండా మొక్కలకు వచ్చిన పూలన్నీ ఒకే పరిమాణంలో ఉండి మంచి రంగు సంతరించుకోవడంతో గిరాకీ కూడా ఎక్కువగా ఉంటుంది.

సస్యరక్షణ:

నారుకుళ్లు తెగులు: నేలలో తడి ఎక్కువగా ఉండి వెచ్చని వాతావరణంలో ఈ తెగులు వ్యాప్తి చెందుతుంది. మొలకెత్తిన నారు మొక్కల కాండం కుళ్లి చనిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల కాప్టాన్ లేదా 1.5 గ్రాముల కార్బండిజమ్ కలిపిన మందు ద్రావణంతో నారు మడిని తడిపి నివారించవచ్చును.

మొగ్గ తొలిచే పురుగు: లార్వాలు పూమొగ్గలను తొలుస్తాయి. పూ మొగ్గలు విచ్చుకోవు. పూల దిగుబడి బాగా తగ్గుతుంది. దీని నివారణకు లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు కార్బరిల్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

పేను: పెద్ద, పిల్ల పురుగులు మొగ్గల్ని ఆశించి నష్టపరుస్తాయి. వీటి నివారణకు లీటరు నీటికి 2 మిల్లీలీటర్ల మలాథియాన్ లేదా 2 మిల్లీలీటర్లు డైమిథోయేట్ కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

తామర పురుగులు: పిల్ల, తల్లి పురుగులు ఆకులు, పూల నుంచి రసాన్ని పీలుస్తాయి. ఆకుల మీద తెల్లని మచ్చలు కనిపిస్తాయి. ఇవి ఆశించిన మొగ్గలు గోధుమరంగుకు మారి ఎండిపోతాయి. నివారణకు లీటరు నీటికి 2 మిల్లీ లీటర్లు డైమిథోయేట్ ను కలిపి పిచికారీ చేయాలి.